## విల్లీస్ గిబ్సన్

పాపులర్ కంప్యూటర్ గేమ్ 'టెట్రీస్'లో అమెరికాకు చెందిన 13 ఏండ్ల విల్లీస్ గిబ్సన్ గెలిచాడు. దీంతో 'నిన్‌టెండో వెర్షన్' పజిల్ గేమ్‌లో 'కిల్ స్క్రీన్' వరకు చేరుకున్న ప్రపంచంలో తొలి వ్యక్తిగా గిబ్సన్ రికార్డు సృష్టించాడు. గతంలో ఈ ఘనతను కృత్రిమ మేధ (ఏఐ) మాత్రమే సాధించింది. ఇప్పటి వరకు ఎవరూ ఈ ఘనతను సాధించలేదని, విల్లీస్ గిబ్సన్ దాన్ని బద్దలు కొట్టాడని 'క్లాసిక్ టెట్రిస్ వరల్డ్ చాంపియన్‌షిప్' అధ్యక్షుడు విన్స్ క్లెమెంట్ జనవరి 3న వెల్లడించారు. ఈ గేమ్‌ను సోవియట్ రష్యాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కనుగొన్నాడు. గిబ్సన్ ఈ గేమ్‌లో 157వ లెవల్‌కు చేరుకోవడం గమనార్హం.

# పద్ధతిగా చదువుదాం



**కొవిడ్‌కు ముందు పదో తరగతి పరీక్షలు ప్రతి సబ్జెక్టుకు రెండు పేపర్లు, హిందీకి ఒక పేపర్ చొప్పున 11 పేపర్లు నిర్వహించేవారు. రెండు విద్యాసంవత్సరాల నుంచి 11 పేపర్లకు బదులు 6 పేపర్లతోనే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. సైన్స్ మినహా మిగతా అన్ని సబ్జెక్టుల్లో ఒకే ప్రశ్నపత్రం, ఒకే బిట్ పేపర్ ఇస్తూ పరీక్ష నిర్వహించడం వల్ల విద్యార్థులు ఎటువంటి అసౌకర్యం లేకుండా పరీక్షలు రాశారు. కానీ సామాన్యశాస్త్ర విషయంలో భౌతిక, జీవ శాస్త్రాలకు వేర్వేరుగా కేవలం 20 నిమిషాల వ్యవధిలో రెండు పేపర్లుగా పరీక్ష రాయడంలో ఇబ్బంది పడటమే కాకుండా నిర్వహణలో కూడా ఇబ్బంది కలిగింది. ఈ అంశాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యా శాఖ దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించిన విద్యాశాఖ భౌతిక, జీవ శాస్త్రాలకు వేర్వేరు రోజుల్లో పరీక్ష నిర్వహించడానికి నిర్ణయించి ఈ విద్యాసంవత్సరం నుంచి ఏడు పేపర్లతో పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూలు విడుదల చేసింది.**

**ఈసారి 7 పేపర్లతో టెన్త్ వార్షిక పరీక్షలు ఆందోళన వీడితే అధిక మార్కులు**

- ప్రశ్నపత్ర నమూనాలో లఘు, అతి లఘు సమాధాన ప్రశ్నల్లో చాయిస్ ఉండదు. వ్యాసరూప ప్రశ్నల సంఖ్య పెరిగింది. వ్యాసరూప ప్రశ్నల్లో మాత్రమే అంతర్గత చాయిస్ ఉంటుంది. కాబట్టి విద్యార్థులు ఎంతో అప్రమత్తతతో పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాలి. 'సి' గ్రేడ్ విద్యార్థులు మరింత అప్రమత్తంగా ఉండి ప్రత్యేక సూచనలను పాటించాలి. పరీక్ష సమయం ఆసన్నమవుతుంది. సన్నద్ధతపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలి. పరీక్ష విధానం మారింది. అందుకు అనుగుణంగా పరీక్షలకు సిద్ధం కావాలి. నూతన పరీక్ష విధానంలో విషయ అవగాహనకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. పాఠ్యవిషయాన్ని తగ్గించి కేవలం ముఖ్యాంశాలను విశదీకరిస్తూ వాటిపై జ్ఞానం, అవగాహన, వినియోగం, నైపుణ్యం, నిత్యజీవిత అన్వయానికి సంబంధించిన ప్రశ్నలను ఇచ్చారు. అందువల్ల పని అనుభవం, స్వీయ రచన, బృంద చర్చల ద్వారా నేర్చుకోవడం అనే విధానాన్ని అనుసరించాలి.

### విద్యాప్రమాణాలను గుర్తించాలి

- ప్రశ్నపత్రాన్ని విద్యాప్రమాణాలకు అనుగుణంగా రూపకల్పన చేస్తున్నారు. దీనివల్ల ఏవో కొన్ని అధ్యాయాలను చదివితే సరిపోదు. అన్ని అధ్యాయాలను చదవాలి. ప్రశ్నలు ఏ అధ్యాయం నుంచైనా, ఎలాగైనా అడగవచ్చు. కాబట్టి విద్యాప్రమాణాలకు అనుగుణంగా ప్రశ్నలను గుర్తించి పరీక్షలకు సన్నద్ధం కావాలి. కేవలం చదివి బట్టీ పడితే సరిపోతుందనుకోవద్దు. ప్రశ్నలను నిజ జీవితానికి అన్వయిస్తూ అడుగుతారు. ప్రశ్నలకు సూటిగా సమాధానాలు ఉండవు. విద్యార్థి తన అవగాహనకు అనుగుణంగా సమాధానాలు రాసే వీలుంది. ప్రస్తుత విధానంలో అన్ని పాఠాలను విధిగా చదివి అవగాహన చేసుకోవాలి. పాఠ్యపుస్తకంలోని ఏ అంశం కూడా బట్టీ పట్టి రాయడానికి ఆస్కారం ఉండదు. పాఠ్యపుస్తకంలోని అంశాలు, భావనలను అవగాహన చేసుకుని నిజ జీవితానికి అన్వయిస్తూ సమాధానాలు రాయాలి. ప్రశ్నలకు సమాధానాలు సూటిగా రాయడానికి బదులు బహుళ సమాధానాలు వచ్చేలా ప్రశ్నల స్వభావం ఉంటుంది. ఒకసారి పబ్లిక్ పరీక్షలో వచ్చిన ప్రశ్నలు తిరిగి పునరావృతం కావు. పాఠ్యపుస్తకంలో ఇచ్చిన ప్రశ్నలు ఉన్నవి ఉన్నట్టుగా రావు. అవే స్వభావంగల ఇతర ప్రశ్నలను రూపొందించి ఇస్తారు. ప్రశ్నలు విద్యార్థుల్లో సృజనాత్మకత, విలువలు, సౌందర్యాత్మక స్పృహ, సహజవనరుల సంరక్షణ, మానవతా విలువలు, జాతీయ సమైక్యత మొదలైన అంశాలను అంచనా వేసే విధంగా రూపొందిస్తారు. కాబట్టి ప్రతి విద్యార్థి సొంతంగా ఆలోచించి సమాధానాలు రాసేలా ప్రిపరేషన్ కొనసాగాలి.

### మూల్యాంకన విశ్లేషణ

- ప్రస్తుత విధానంలో హిందీతో పాటు ఇప్పుడు మిగతా భాష, భాషేతర సబ్జెక్టులకు ఒకటే పేపరు. ఒక్కో పేపర్ 100 మార్కులకు ఉంటుంది. ఇందులో 80 మార్కులకు పబ్లిక్ పరీక్ష, పరీక్ష వ్యవధి 3 గంటలు. మిగతా 20 మార్కులకు పాఠశాలలో ఫార్మాటివ్ (అంతర్గత ) మూల్యాంకనం ద్వారా మార్కులు కేటాయిస్తారు.

## 'తెలుగు'ను తేలికగా తీసుకోవద్దు

80 మార్కులు – సమయం 3 గంటలు

విద్యాప్రమాణాలు – మార్కులు పార్ట్–ఎ 60 మార్కులు

1. అవగాహన–పతిస్పందన (పఠన అవగాహన)– 20 మార్కులు

అ) పరిచిత గద్యంలో ఉపవాచకానికి సంబంధించి 8–10 వాక్యాలు రెండు పేరాల్లో ఇస్తారు. వీటికి సంబంధించి 5 ప్రశ్నలు ఇస్తారు. 5X1 = 5 మార్కులు

ఆ) పరిచిత పద్యంలో పాఠ్యపుస్తకంలోని చుక్క గుర్తు ఉన్న పద్యాలు అంతర్గత చాయిస్‌తో ఇస్తారు. వీటికి సంబంధించి పద్యాన్ని పూరించి భావం రాయమని గాని **లేదా** పద్యాన్ని ఇచ్చి ప్రతిపదార్థం రాయమని అడుగుతారు. 5X1 = 5 మార్కులు

ఆ) అపరిచిత గద్యం/పద్యంలో ఏదో ఒకటి ఇస్తారు. గద్యం అయితే వైజ్ఞానిక, సామాజిక, పర్యావరణ వంటి అంశాలపై 8–10 వాక్యాలు రెండు పేరాల్లో ఇస్తారు.


- పద్యం అయితే సరళమైనది, సులభమైనది, బాగా ప్రాచుర్యం ఉన్న శతకాల నుంచి ఇవ్వొచ్చు. వీటికి సంబంధించి 5 ప్రశ్నలు ఇస్తారు.
- ప్రతి ప్రశ్నకు 2 మార్కులు. 5X2 =10 మార్కులు

2. సృజనాత్మకత – వ్యక్తీకరణ 40 మార్కులు

అ) 5 లేక 6 వాక్యాల్లో లఘు సమాధానాలు రాసేవి 4 ప్రశ్నలు చాయిస్ లేకుండా ఇస్తారు 4X3 = 12

ఆ) పద్యభాగం నుంచి ఒకటి, గద్య భాగం నుంచి ఒకటి, ఉపవాచకం నుంచి ఒకటి, సృజనాత్మకతకు సంబంధించి ఒకటి అంతర్గత చాయిస్‌తో 4 వ్యాసరూప ప్రశ్నలు ఇస్తారు 4X7 = 28

పార్ట్–బి 20 X 1 = 20



- భాషాంశాలకు చెందిన ప్రశ్నలు ఇస్తారు. ఇందులో 10 పదజాలానికి, 10 వ్యాకరణాంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. ఇందులో మొదట రెండు పదాలకు సొంత వాక్యాలు అడుగుతారు. 8 ప్రశ్నలు పర్యాయ పదాలు, నానార్థాలు, అర్థాలు, వ్యుత్పత్త్యర్థాలు, ప్రకృతి వికృతులు వంటివి అడుగుతారు. 10 వ్యాకరణాంశ ప్రశ్నల్లో సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు, వాక్యాల (సంశ్లిష్ట, సం యుక్త, కర్తరి, కర్మణి, ప్రత్యక్ష/ పరోక్ష కథన, ఆధునిక వాక్యాలు) వంటి ప్రశ్నలు అడుగుతారు. ఇవన్నీ బహుళైచ్ఛిక ప్రశ్నలు. **మొత్తం** 20 X 1 = 20
- తొలి పరీక్ష కావడం వల్ల భయాందోళన, ప్రాథమిక అంశాలు, వ్యాకరణం, పద్య రచనల్లో అభిరుచి లేకపోవడం తేలికైన తెలుగులో తక్కువ మార్కులు రావడానికి కారణాలు. మాతృభాషే కదా చాలా సులభమనే భావనతో అతి ఆత్మవిశ్వాసంతో చివరికి ఫెయిలై బాధ పడుతుంటారు. తెలుగులో మంచి మార్కుల సాధనకు మార్గాలు అనేకం. మాతృభాషపై మమకారం పెంచుకుని, చిన్న చిన్న మెలకువలను పాటిస్తూ, కొద్దిగా శ్రమిస్తే పదిలంగా పది పాయింట్లు సాధించవచ్చు.
- పాఠ్యాంశాలను చదివేటప్పుడు శ్రద్ధ, సమయ పాలన, కచ్చితత్వం పాటించాలి.
- సవర్ణ దీర్ఘ, గుణ, త్రిక సంధుల ఉదాహరణలను బాగా చదవాలి.
- వ్యాస రచన ప్రశ్నల్లో ఎక్కువగా అడిగే అవకాశమున్న పండుగలు, సమకాలీన అంశాలు, ఎయిడ్స్ వ్యాధి, ప్రపంచీకరణ, ప్రకృతి విపత్తుల వంటి అంశాలపై బాగా అవగాహన పెంచుకోవాలి.
- ప్రకృతి–వికృతులు, పద్య లక్షణాలు, పర్యాయ పదాలు, వ్యుత్పత్తి అర్థాలు, అలంకారాలు, నానార్థాలు, ఛందస్సు, పరోక్ష వాక్యాలు, సంయుక్త వాక్యాలు, విగ్రహ వాక్యాలు, సమాసానికి ఉదాహరణలపై అవగాహన పెంచుకుంటే మార్కులు సులభంగా పొందవచ్చు.
- ప్రతిపాఠం కవి–కవి పరిచయం, శతక పద్యాలు–భావాలు, పాఠ్య పుస్తకం వెనుక ఉన్న ఉదాహరణలు, వ్యాకరణాంశాలు ప్రాక్టీస్ చేయాలి.
- అర్థ సందర్భాలు సందర్భానికి తగినట్లు రాయాలి.
- జాతీయానికి, సొంతవాక్యాలకు ఉన్న తేడాను గమనించి సమాధానాలు రాయాలి.
- పఠన అవగాహనలో తెలిసిన, తెలియని గద్య, పద్య అంశాలను చదివి అవగాహన చేసుకుని సమాధానాలు రాస్తే తేలికగా 20 మార్కులు పొందవచ్చు.
- గైడ్ కంటే పాఠ్యపుస్తకానికే ప్రాధాన్యం ఇవ్వాలి.
- అక్షర దోషాలు, ఒత్తు, పొల్లులు తప్పుల్లేకుండా జాగ్రత్త వహించాలి.
- కొన్ని సార్లు కవుల పేర్లు తప్పుగా రాస్తుంటారు. ఈ అంశాన్ని గుర్తించాలి.
- మూల్యాంకన నిబంధనలకు అనుగుణంగా పరీక్షలకు సన్నద్ధం కావడం చాలా ముఖ్యం.
- రాసే సమాధానాల్లో స్పష్టత ఉండాలి.
- దస్తూరి అందంగా ఉంటే మరిన్ని మార్కులు పొందవచ్చు.

## పాయింట్లు పెంచే 'హిందీ'

**హిందీ: విద్యాప్రమాణాలు కేటాయించిన మార్కులు**


**80 మార్కులు – సమయం 3 గంటలు**

**పార్ట్–ఎ 60 మార్కులు**

1. అవగాహన, ప్రతిస్పందన (పఠన అవగాహన) 20 మార్కులు (5+10+5)
2. వ్యక్తీకరణ – సృజనాత్మకత 40 మార్కులు (16+24)

పార్ట్–బి 20 X 1 =20

- పదజాలాంశాలు– 10 మార్కులు
- వ్యాకరణాంశాలు– 10 మార్కులు
- జాతీయభాష హిందీలో అధిక మార్కులు సాధించడంలో చాలామంది విఫలమవుతున్నారు. హిందీలో 10కి 10 సాధించిన వారి సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. భాషపై భయాన్ని వీడి అర్థం చేసుకుంటే హిందీలో కూడా 10కి 10 సులభంగా సాధించవచ్చు. హిందీపై అవగాహన లోపించడం, చిన్న చిన్న పదాలకు అర్థాలు తెలుసుకోలేకపోవడం, తప్పులతో కూడిన దస్తూరి విద్యార్థుల వైఫల్యానికి ప్రధాన కారణాలు. ఆరో తరగతి నుంచే భాషలో బలమైన పునాదులు పడేలా శ్రద్ధ తీసుకోవాలి.




- చిన్న చిన్న పదాలతో హిందీని తేలికగా రాయవచ్చు. ఇవే భాషకు మూలం. రాసేటప్పుడు అక్షర దోషాలు లేకుండా జాగ్రత్త పడాలి. లేకపోతే ఆ పదానికి అర్థమే మారిపోతుంది.
- ఎక్కువ మార్కులు సాధించే వ్యాసరూప ప్రశ్నలు, స్వీయ రచనలపై పట్టు సాధించాలి.
- పాఠ్యాంశం చివరన ఉన్న బిట్లు చదివతే 20 మార్కులు వస్తాయి.
- చుక్క గుర్తు ఉన్న పద్యాలు కంఠస్థం చేయడమే కాకుండా వాటి భావాలను చదివి రాయడం అభ్యాసం చేయాలి.
- లేఖల్లో ఎన్నో రకాలు ఉన్నప్పటికీ మిత్రునికి లేఖ, చుట్టీ పత్ర్ ఎక్కువగా అడుగుతుంటారు. వీటిని బాగా చదవాలి.
- ప్రశ్నపత్రం పార్ట్–ఎ లో గద్య, పద్య భాగాలను చదివి అవగాహన చేసుకుని సమాధానాలు రాస్తే 20 మార్కులు సాధించవచ్చు.
- సంధి విచ్ఛేదనం, విశేషణం, ముహావరా (జాతీయాలు), లింగ్ బదల్‌నా, వచన్ బదల్‌నా వంటి శబ్ద, వాక్య సంబంధ వ్యాకరణాంశాలపై ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి.
- చేతి రాత కూడా ఆకర్షణీయంగా ఉంటే మార్కులు కోల్పోయే అవకాశం తక్కువ.